# పావలా

జెయువిబి ప్రసాద్

కథ

**అప్పలకొండ చిన్న ఇనుప గూటం పట్టుకుని స్కూలు గంట కొట్టడానికి వెళుతూ వుంటే పిల్లలందరూ సంతోషంగా చూశారు అతన్ని.**

**గంట అంటే అది నిజమైన గంట కాదు. విరిగిపోయిన చిన్న రైలు పట్టా ముక్క అది. ఆ ఇనుప ముక్కని ఎక్కడి నుంచో సంపాదించి, దానికి ఒక తాడు కట్టి వేలాడదీశారు స్కూలువాళ్ళు.**

**అప్పలకొండ స్కూలు గంట గణ గణమని కొట్టగానే అప్పటికే పుస్తకాలు అన్నీ సర్దేసుకుని వున్న అన్ని తరగతుల్లోని పిల్లలూ ఒక్క ఉదుటన అరుచుకుంటూ బయటపడ్డారు.**

కొందరు పిల్లలు ఆడుకోవడానికి స్కూలు గ్రౌండ్‌కి వెళితే, మరి కొందరు పిల్లలు ఇళ్ళ ముఖం పట్టారు. మొత్తం మీద పిల్లలందరి మొహాల్లోనూ స్కూలు అయిపోయిందన్న సంతోషం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

రెండో క్లాసు చదువుతున్న మధు- పలకని భద్రంగా పట్టుకుని, అయిదో క్లాసు చదువుతున్న తన అక్క శారద వేపు పరుగుదీశాడు. వాడికి స్కూళ్ళో ఆడుకోవడం ఇష్టం లేదు. పలకని ఇంట్లో దాచుకుని, వీధిలో వున్న స్నేహితులతో ఆడుకొనేవాడు ఇంటికి దగ్గరలోనే రోడ్డు మీద. అప్పుడప్పుడు వాడక్క శారద, ఇంకా కొంతమంది ఆడపిల్లలు వాళ్ళతో కలిసి ఆడేవారు.

మధూ వెళ్ళేసరికి అశోకవనంలో సీతాదేవికున్నంత దుఃఖంతో బుర్ర వంచుకుని వుంది శారద. పక్కనే నించుని శారద క్లాస్‌మేట్ ఏమిటేమిటో అనేస్తోంది.

"మా నాన్నకీ విషయం తెలిస్తే నన్ను చంపేస్తాడు బాబూ! రేపటికల్లా నువ్వు పావలా ఇవ్వకపోతే మీ ఇంటికి వచ్చి మీ అమ్మతో చెప్తాను" అంది ఆ పిల్ల గడుసుగా.

"వద్దే! ఆ అమ్మ గట్టిగా కొట్టేస్తుంది. నేనెలాగో అలాగ నీకు డబ్బులిచ్చేస్తాగా రేపటికల్లా" నెమ్మదిగా చెప్పింది శారద. ఆ పిల్ల తలాడించి వెళ్ళిపోయింది.

మధూకేమీ అర్థం కాలేదు.

"ఏమిటే శారదా! పావలా అంటుంది ఆ పిల్ల?" అడిగాడు అక్కని.

"అది కాదురా! పొద్దున్న ఆ పిల్ల స్కూలుకి ఒక పెన్ను తెచ్చింది. వాళ్ళ నాన్న పెన్నుట. ఒకసారి చూసి ఇస్తానని తీసుకున్నాను. చూస్తూ వుండగా చేతిలోంచి జారి కింద పడింది. కేప్ చిట్లి బీట పడింది. దాని ఖరీదు పావలాట. రేపటికి ఇవ్వకపోతే ఇంటికొచ్చి అమ్మకి చెబుతుందిట" దిగులుగా చెప్పింది అసలు విషయం. మధూకి కూడా దిగులేసింది ఆ విషయానికి.

ఇంట్లో ఎన్నో విషయాల్లో బాగా కొట్టుకున్నా, బయటికి వచ్చాక ఒకరిమీదొకరు అభిమానంతో వుంటారు అక్కా, తమ్ముళ్ళిద్దరూ. వాళ్ళమ్మని పావలా అడగటానికి ఇద్దరికీ ధైర్యం లేదు. ఇస్తుందన్న నమ్మకమూ లేదు.

వాళ్ళదొక దిగువ మధ్య తరగతి కుటుంబం. వాళ్ళ నాన్న ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ ఉంటాడు. వాళ్ళమ్మ ఆ సంపాదనతోనే ఇల్లు గడుపుకొస్తోంది. అందుకే వాళ్ళింట్లో చిరుతిళ్ళు వుండవు. పిల్లలకి ఏమన్నా కొనుక్కోవడానికి చిల్లర డబ్బులు ఇచ్చేవారుకాదు. పిల్లలకి మూడు పూట్లా అన్నం తిని, గవర్నమెంటు స్కూలుకి వెళ్ళడమే తెలుసు.

పిల్లలు స్కూలు నించి ఇంటికొచ్చేసరికి ఆకలితో వుండేవారు సాయంకాలం. అందరు పిల్లలూ వాళ్ళింట్లో పాలు తాగి, ఏమన్నా చిరుతిళ్ళు తిని ఆడుకోవడానికి వెళ్తే, అక్కా తమ్ముళ్ళిద్దరూ ఏమీ లేకుండానే వెళ్ళేవారు. వాళ్ళమ్మ ఆరున్నరకల్లా అన్నం పెట్టేసేది. మరీ ఆకలిగా వుందని ఎప్పుడన్నా గోల చేస్తే, వాళ్లమ్మ కాస్త అన్నం తినిపించి ఆడుకోవడానికి పంపేది. వాళ్ళకీ అదే అలవాటయిపోయింది. పావలా సంపాదించడం అనేది ఆ పిల్లలకి ఒక యజ్ఞం.


ఆ విషయం తెలిస్తే వాళ్ళమ్మ శారదని చావబాదుతుందని ఇద్దరికీ తెలుసు. అందుకే వాళ్ళమ్మకి ఆ విషయం చెప్పదలచుకోలేదు వాళ్ళిద్దరూ. ఇంటికొచ్చాక స్నేహితులు పిల్చినా ఆడుకోవడానికి వెళ్ళకుండా అరుగు మీదే కూర్చున్నారు దిగులుగా.

"ఇప్పుడెలాగే మరి?" జాలిగా అడిగాడు మధు.

ఠక్కున అయిడియా వచ్చింది శారదకి.

"పక్క సందులో వున్న మామ్మగారింటికి వెళదాం. ఆవిడకి పనులన్నీ చేసిపెట్టి చివరలో తిండి వద్దు, డబ్బులిమ్మని అడుగుదాం! ఏం?" అడిగింది సంతోషంగా.

మధు కళ్ళుమెరిశాయి ఆ అయిడియాకి. వాడికి నచ్చింది ఆ ప్లాను. వాళ్ళిద్దరూ పక్క సందులోని ముసలావిడింటి వేపు నడవటం మొదలుపెట్టారు.



పక్క సందులో ఒక ముసలావిడ ఒంటరిగా జీవిస్తూ ఉంటుంది ఒక ఇంటిలోని ఒంటి గది వాటాలో. ఆవిడకి ఏదో పెన్షన్ వస్తూ ఉంటుంది. ఆవిడ జీవితం సంగతులు పిల్లలకి తెలియవు. అటువేపు వెళ్ళినప్పుడల్లా ఆ ముసలావిడ వీళ్ళిద్దరినీ పట్టుకునేది. ముఖ్యంగా శారద చేత ఇంటిపని చేయించేది. ఇల్లు తుడవడం, గిన్నెలు కడగడం, ఎండేసిన బట్టలు మడత పెట్టడం, వాకిట్లో తుడిచి, కాసిని నీళ్ళు చల్లి, ముగ్గేయడంలాంటి పనులు చేయించేది శారదచేత. మధూ కూడా ఉంటే అక్కకి సాయం చేసేవాడు. మళ్ళీ వాళ్ళిద్దరూ తమింట్లో ఒక్క పని చేసేవారు కారు. ఇంటి పనులన్నీ వాళ్ళమ్మే చూసుకునేది. నెలలో మూడు రోజులు మాత్రమే వీళ్ళిద్దరికీ పని చేయాల్సి వచ్చేది తమ ఇంట్లో. 'చేయం' అని చెప్పటానికి ముందరగా వీళ్ళకి మొహమాటం. ఆ ముసలావిడ నవ్వుతూ, గడుసుగా వీళ్ళని మొహమాట పెట్టేసి వీళ్ళ చేత పనులు చేయించుకునేది. పనులన్నీ అయిపోయేక తినడానికి చేతిలో ఏ దిబ్బరొట్టె ముక్కో, మరో చిరుతిండో పెట్టేది. ఎక్కువ పని చేయించుకుని, కొంచెం తిండి పెట్టేది. దాంతో దరిదాపుల్లో ఆ ముసలావిడ కనబడితే వీళ్ళిద్దరూ పారిపోయేవారు ఆవిడ పిలుపుకి అందకుండా. ఒక్కోసారి దొరికిపోయేవారు.

అంతేగాక, మరీ ఆకలిగా అనిపించినప్పుడు వీళ్ళే "మామ్మగారూ! ఏం చేస్తున్నా రూ?" అంటూ వెళ్ళేవారు ఆవిడింటికి.

అటువంటప్పుడు ఆ ముసలావిడ వీళ్ళ సంగతి కనిపెట్టేసి, మరింత ఎక్కువ పని చేయించుకునేది కొంచెం తిండి పెట్టడానికి.


ఒక్కోసారి శారద ఒక్కతే వెళ్ళి పని చేసి, తిండి సంపాదించుకుని అందులో

కొంత తమ్ముడికీ పెట్టేది. ఆ విషయం వాళ్ళమ్మకి తెలిస్తే చంపేస్తుందనే భయంతో వీళ్ళిద్దరూ ఆవిడకి ఎప్పుడూ చెప్పలేదా సంగతి.

అక్కా, తమ్ముళ్ళిద్దరూ పరుగెత్తుకుంటూ పక్కసందులోని ముసలావిడింటికి వెళ్ళారు. వాళ్ళని చూడగానే వాళ్ళవసరం పసిగట్టేసిందా ముసలావిడ.

ఆరోజు వాళ్ళకి చెప్పిన పనులిన్నని కాదు. కానీ ఎప్పటిలా గంటు మొహాలతో కాకుండా, పనులన్నీ ఉత్సాహంగా చేశారు. వాళ్ళ ఉత్సాహం చూసి ముసలావిడకి ఆశ్చర్యం వేసింది. దొరికిందే ఛాన్సని ఎక్కువ పనులు చేయించుకుంది. అందులో ఒక పని ఆవిడకి శారద నూనె రాసి తల దువ్వితే, ఆవిడ వేలు ముడి చుట్టుకోవడం.

శారద ఆ పని చేస్తున్నప్పుడు, మధు వాకిట్లో చీపురుతో తుడిచి, నీళ్ళు చల్లి చిన్న ముగ్గేశాడు.



"బాగానే వచ్చేసిందిరా ముగ్గు నీకు!" శారద మెచ్చుకుంది వాడిని.

సంతోషంగా చూశాడు మధూ. ఎంతోకాలం నించీ పరిశీలనగా వాళ్ళమ్మని, వాళ్ళక్కనీ చూసిన వాడికి కొన్ని ఇంటి పనులు అవలీలగా వచ్చేశాయి. చిన్న పిల్లవాడవటం వల్ల మగతనపు దురఃకారం వాడికింకా రాలేదు.

మొత్తానికి పనులన్నీ పూర్తి చేసి ముసలావిడ ముందర నిలబడ్డారు.

"వుండండ్రా పిల్లలూ! దిబ్బరొట్టె చేశాను. మీ ఇద్దరికీ పెడతాను" అంటూ లేవబోయింది ముసలావిడ.

"దిబ్బరొట్టె వద్దు మామ్మగారూ! మాకు అస్సలు ఆకలి లేదు. ఒక పావలా ఇవ్వండి చాలు వెళ్ళిపోతాం" చెప్పింది శారద.

విడ్డూరంగా చూసింది ముసలావిడ. "ఇది మరీ బాగుందే! పావలా నేనెక్కడనించి తేను? నా దగ్గర డబ్బులేవీ లేవు"

"కాదు మామ్మగారూ' మాకు చాలా అవసరం. ఒక్క పావలా ఇవ్వండి. రేపు ఏమీ తీసుకోకుండా పని చేసిపెడతాం" బతిమాలుతూ అడిగింది శారద.

మధు కూడా జాలిగా మొహం పెట్టి చూశాడు ముసలావిడ వేపు.

"చూడు శారదా! డబ్బులడిగితే మీ అమ్మతో చెబుతాను. రొట్టె తీసుకుని వెళ్ళండి" అంటూ బెదిరించి వాళ్ళిద్దరి చేతుల్లోనూ చెరో రొట్టి ముక్కా పెట్టింది.

ఏడుపు మొహాల్తో బయట సందులోకి వచ్చారు అక్కా, తమ్ముళ్ళిద్దరూ. వాళ్ళకేం చేయాలో పాలు పోలేదు.

అంతలో ఎక్కడనించో ఒక వీధి కుక్క దూసుకువచ్చి మధూ చేతిలోని రొట్టెముక్క కరుచుకుని పారిపోయింది. ఆ ఆకస్మిక పరిణామానికి తడబడిపోయి, గట్టిగా అరిచి కిందపడిపోయాడు మధు.

వాడి మోచేతులూ, మోకాళ్ళూ చెక్కుకుపోయాయి.

శారద వాడిని లేవదీసింది. వాడు ఏడుపు ముఖం పెట్టాడు.

"వద్దురా! ఏడవొద్దు!" అని చెప్పి తన రొట్టెలో సగం పెట్టింది తమ్ముడికి. వాళ్ళిద్దరూ ఆ రొట్టె ముక్క తినేసి, వీధి కుళాయి దగ్గర చేతులు కడుక్కున్నారు.

వాళ్ళ ఉత్సాహం చూసి ముసలావిడకి ఆశ్చర్యం వేసింది. దొరికిందే ఛాన్సని ఎక్కువ పనులు చేయించుకుంది. అందులో ఒక పని ఆవిడకి శారద నూనె రాసి తల దువ్వితే, ఆవిడ వేలు ముడి చుట్టుకోవడం. శారద ఆ పని చేస్తున్నప్పుడు, మధు వాకిట్లో చీపురుతో తుడిచి, నీళ్ళు చల్లి చిన్న ముగ్గేశాడు.

శారద నీళ్ళతో వాడి మోచేతులూ, మోకాళ్ళూ కడిగింది. చర్మం చిట్లి ఎర్రగా వుందక్కడ.

బాధగా చూసిన అక్కకి "ఆడుకుంటూ ఉండగా పడిపోయానని చెప్తానులే అమ్మకి" అని ధైర్యం చెప్పాడు.

ఇద్దరూ ఇల్లు చేరారు.

"అలా ముంగి మొహాలు వేసుకున్నారేం? ఇంతసేపు ఎక్కడకి పోయారు?" అడిగింది వాళ్ళమ్మ.

"ఇవాళ పక్క వీధిలో ఆడుకున్నాం" మధు జవాబు చెప్పాడు.

"సరే! సరే! అన్నాలు తిని కాసేపు చదువుకోండి" అంటూ లోపలికి వెళ్ళింది వాళ్ళమ్మ.

ఎప్పటిలా అన్నాల దగ్గర కొట్టుకోకుండా, బుద్ధిగా అన్నాలు తినేశారు. కాసేపు చదువుకుని నిద్రకు ఉపక్రమించారు. అంతసేపూ దిగులుగానే వున్నారిద్దరూ.

మర్నాడు స్కూలుకెళ్ళే దారిలో అడిగాడు అక్కని మధు.

"మరెలాగే పావలా సంగతి? ఏం చెయ్యాలి?"

వాళ్ళమ్మ దెబ్బల నించీ ఎలాగన్నా అక్కని కాపాడుకోవాలని వాడి ఆదుర్దా.

"ఏమోరా! తెలియదు. ఆ దేవుడే ఏదో చెయ్యాలి. పొద్దున్నే బాగా దణ్ణం పెట్టుకున్నాను. ఎలాగో అలాగ దేవుడు కాపాడుతాడు" అంది శారద నమ్మకంగా.

మధుకి ఏమీ నమ్మకం కలగలేదు.

మధ్యాహ్నం ఇంటికెళ్ళే దారిలో మళ్ళీ అడిగాడు అక్కని.

"సాయంకాలం వరకూ టైం వుందిగా! ఏదో జరుగుతుందిలే!" అంది ధైర్యంగా శారద.

అపనమ్మకంగా చూశాడు మధూ.

"లేకపోతే అమ్మ కొడుతుంది. అంతేగా! దెబ్బలు తినేస్తానులే!" అంది శారద తెగింపుగా.

మధు మనసంతా బాధతో నిండిపోయింది. వాళ్ళమ్మమీద కోపం వచ్చింది వాడికి.

"ఏం? పావలా ఇచ్చి, శారదని కొట్టకుండా వుండచ్చు కదా అమ్మ!"

కేప్‌ని శారదేమీ కావాలని విరగకొట్టలేదు కదా! మొన్నామధ్య ఆవకాయ జాడీ మూత అమ్మ చేతిలోంచి జారిపడి ముక్కలయింది. ఆ జాడీ అమ్మమ్మ కొనిపెట్టిందిట. అమ్మ తనని తనేమీ కొట్టుకోలేదుగా! అప్పటినించీ ఆవకాయ జాడీమీద సత్తుమూత పెట్టేది బదులుగా. మరిప్పుడు శారదని మాత్రం కొట్టడం ఎందుకు?" మధు చిన్న బుర్రలో ఆలోచనలు సాగిపోతూనే వున్నాయి.

ఆ ఆలోచనల్లోనే మధుకి ఒక అయిడియా తట్టింది. మళ్ళీ వెంటనే భయం వేసింది ఆ అయిడియాకి. దాని గురించే ఇంకొంచెం సేపు ఆలోచించాడు. కాస్త ధైర్యం వచ్చింది. ఎలాగన్నా అక్కని అమ్మ దెబ్బల నించి రక్షించాలని కంకణం కట్టుకున్నాడు మధు.

మధ్యాహ్నం ఇంటర్వెల్ తర్వాత పిల్లలందరూ క్లాసులోకి వచ్చాక,

టీచరు ఏదో వెతుక్కోవడం మొదలు పెట్టాడు.

పక్క తరగతికీ, ఈ తరగతికీ మధ్యలో ఏమీ అడ్డు లేదు.

పక్క తరగతి టీచరు "ఏంటి మేస్టారూ వెతుక్కుంటున్నారు?" అడిగాడు.

"పెన్ను కేప్ కనిపించడం లేదు మేస్టారూ! ఆటెండెన్సు బుక్‌లో పెన్ను పెట్టి, ఇంటర్వెల్లో బయటికి వెళ్ళి వచ్చాను. పెన్ను వుంది గానీ కేప్ మాత్రం లేదు" అర్థం కానట్టు మొహం పెట్టి అన్నాడా టీచరు.

"మీ క్లాసు పిల్లలెవరన్నా తీశారేమో అడిగి చూడండి సార్!" సలహా ఇచ్చాడు పక్క తరగతి టీచరు.

"పిల్లలూ! నా పెన్ను కేప్ ఎవరన్నా చూశారా?" అపనమ్మకంగానే అడిగాడా టీచరు పిల్లలందర్నీ.

"లేదు టీచర్!" అంటూ పిల్లలందరూ గావు కేకలు పెట్టారు.

మధు లాగు జేబు బరువెక్కింది. వాడు భయంతో బిక్కి బిక్కి చూడసాగాడు.

"పెన్ను వదిలేసి కేప్ మాత్రం ఎవరు తీస్తారు సార్!' సందేహం వ్యక్తపరిచాడు ఆ టీచర్.

"ఏమోనండీ! ఈ కోతి పిల్లల సంగతి చెప్పలేం. అందరి జేబులూ చెక్ చేయండి సార్ ఒకసారి" హితవు చెప్పాడా పక్క తరగతి టీచర్. ఈ మాటలు వింటున్న మధుకి గుండెలు జారిపోయాయి.

ఇంతలో అప్పలకొండ గంట కొట్టగానే అందరు పిల్లలూ కేకలేసుకుంటూ బయటికి పరుగెత్తారు. దేవుడిని తలుచుకుంటూ మధు కూడా శారద తరగతి దగ్గరకి పరుగెత్తాడు.

అక్కడ శారద హరిశ్చంద్రుడిలా దిగులు మొహం పెట్టుకుని వుంది. ఆ పిల్ల నక్షత్రకుడి చెల్లెలిలా గట్టిగా చూస్తూ వుంది.

లాగు జేబు పట్టుకుని, మెరుస్తున్న కళ్ళతో వగరుస్తూ వచ్చిన మధుని అర్థం కానట్టు చూసింది శారద.

"మా అక్కనేమీ అనకు!" అంటూ లాగు జేబులోని పెన్ను కేప్ తీసి నక్షత్రకుడి చెల్లెలి చేతిలో పెట్టాడు మధూ.

పావలా వస్తుందని ఎదురు చూస్తున్న ఆ పిల్ల తెల్లబోయింది.

ఆ పిల్ల ఆ కేప్‌ని తన స్కూలు బేగ్‌లో వున్న పెన్నుకి తగిలించి చూసింది. కేప్ కాస్త లూజ్‌గా వుండటమే కాకుండా, వేరే రంగుది. అడుగునున్న పెన్ను ఒక రంగుది, పైనున్న కేప్ ఇంకొక రంగుది. నక్షత్రకుడి చెల్లెలు ఆ కేప్ తీసి మధు చేతిలో పెట్టేసింది.

"ఇలాంటి కేప్ కుదరదబ్బా! అచ్చం నా కేప్ లాంటి కేప్ అన్నా ఇయ్యాలి. లేదా పావలా అన్నా ఇయ్యాలి!" మొండికి తిరిగింది ఆ పిల్ల.

మధూ హతాశుడయ్యాడు. చేతిలోని కేప్ వేపు నిస్సహాయంగా చూశాడు. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు వాడికి. వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. శారదకి ఇంక తెగింపు వచ్చేసింది.

"మాతో మా ఇంటికి రా! ఈ విషయం మా అమ్మతో చెప్పు" అంది ఆ పిల్లతో.

ముగ్గురూ వాళ్ళింటి మొహం పట్టారు.

**ఆ ఆలోచనల్లోనే మధుకి ఒక అయిడియా తట్టింది. మళ్ళీ వెంటనే భయం వేసింది ఆ అయిడియాకి. దాని గురించే ఇంకొంచెంసేపు ఆలోచించాడు. కాస్త ధైర్యం వచ్చింది. ఎలాగన్నా అక్కని అమ్మ దెబ్బల నించి రక్షించాలని కంకణం కట్టుకున్నాడు మధు.**

అయితే మధు ఎవరూ లేని వాడి తరగతిలో బల్లమీద ఆ పెన్ను కేప్ పెట్టడం మాత్రం మరిచిపోలేదు.

ఇంటికి నడుస్తున్న శారదని చూస్తే మధుకి కొన్నాళ్ళ కిందట ఒక ఊరేగింపులో అలంకరించి తీసుకువెళ్తున్న మేకపిల్ల గుర్తొచ్చింది. మొదట్లో అలంకరించిన మేకపిల్ల విషయం అర్థం కాక అడిగితే, శారద వాడికి వివరాలన్నీ చెప్పింది.

వాడి మనసంతా దిగులుతో నిండిపోయింది.

తన పిల్లలతో పాటు వచ్చిన ఈ కొత్త పిల్లని ప్రశ్నార్థకంగా చూసింది వాళ్ళమ్మ.

"చెప్తానన్నావుగా! నువ్వే చెప్పు" అంది శారద ఆ పిల్లతో.

"మరేమోనండీ! మీ అమ్మాయి నా పెన్ను కేప్ విరగ్గొట్టిందండీ! మరండీ దాని ఖరీదు పావలా అండీ! నా పావలా నాకిచ్చేస్తే వెళ్ళిపోతానండీ!" ధైర్యంగా చెప్పిందా పిల్ల.

అంతే! వాళ్ళమ్మకి ఉగ్రం వచ్చేసింది.

"ఇలా ఇంటికి గొడవలు తీసుకువస్తావుటే దరిద్రురాలా?" అంటూ గూట్లోని చేంతాడుతో ఒక్క దెబ్బ వేసింది శారద వీపుమీద వాళ్ళమ్మ. శారద మంటతో కెవ్వున అరిచింది.

నక్షత్రకుడి చెల్లెలు భయంతో బిక్క చచ్చి



పోయింది. చెప్పగానే వాళ్ళమ్మ పావలా ఇచ్చేస్తుందనుకుంది ఆ పిల్ల. ఇలా కొడుతుందనుకోలేదు.

"కొట్టానుగా! ఇంక ఇంటికెళ్ళు!" అని వాళ్ళమ్మ నక్షత్రకుడి చెల్లెలిని కసురుకుంది.

పావలా దొరక్కా, పెన్ను కేపూ దొరక్కా ఎలా ఇంటికి పోవాలో తెలియక ఆ పిల్ల అలాగే నిలుచుండిపోయింది.

వాళ్ళమ్మ చేయగలిగిందల్లా తన పిల్లని కొట్టి, ఆ దెబ్బలతో ఆ కొత్త పిల్లని సంతృప్తి పరిచి, తనింటికి పంపడం. ఎందుకంటే ఇవ్వడానికి ఆవిడ దగ్గర పావలా లేదు మరి. వున్నా కేప్ కోసం ఇచ్చేంత విశాల హృదయమూ లేదు ఆవిడకి.

కేప్ పిల్ల ఇంకా అలాగే వుండటం చూసి, శారదని మళ్ళీ కొట్టడానికి చెయ్యెత్తింది వాళ్ళమ్మ.

"అమ్మా! కొట్టద్దే! ఇంకెప్పుడూ అలా తప్పు పని చెయ్యనే! కొట్టద్దే!" అంటూ శారద బతిమాలుతూ చేతులు అడ్డం పెట్టింది.

ఆ మాటలు పట్టించుకోకుండా చేంతాడున్న చెయ్యిని ఇంకో దెబ్బ వేయడానికి దింపబోతుండగా గట్టిగా అరిచాడు మధు.

"అమ్మా! అక్కని కొట్టద్దు!"

వాడి అరుపులోని తీవ్రతకి కోపంతోనూ, ఆశ్చర్యంతోనూ చూసింది వాళ్ళమ్మ.

"వుండమ్మా!" అంటూ లోపలికి పరుగెత్తాడు మధు.

అర నిముషంలోనే బయటకి చేతిలో చిన్న హుండీతో వచ్చాడు. అది మట్టితో చేసిన చిన్న హుండీ.

వచ్చే దీపావళికి ఒక పిస్తోలు కొనుక్కోవాలని అందులో డబ్బులు దాచుకుంటున్నాడు. వాడికెక్కడినించి డబ్బులొస్తాయి? రోడ్డు మీద ఎప్పుడో దొరికిన ఒక నయాపైసో, లేక ఏవన్నా సరుకులు కొనమని వాళ్ళమ్మ వాడిని కొట్టుకి పంపితే- మిగిలిన ఒక పైసానో వాడి దగ్గర వుండేది. కొన్ని నెలల కిందట పక్కింట్లో పిల్లలకి భోగి పళ్ళు పోస్తే, వాటిలో కాసిని పైసలు దొరికాయి వాడికి. వాటినే ఇంట్లో వున్న మట్టి హుండీలో దాచుకుంటున్నాడు డెబ్బై పైసలు పెట్టి దీపావళి పిస్తోలు కొనుక్కోవడానికి. గత రెండు నెలలుగా ఒక్క పైసా కూడా దొరక్క, వాడా హుండీ సంగతే మర్చిపోయాడు.

మధు ఆ హుండీని అక్కడే నేలకేసి పగల కొట్టాడు.

శారదా, మధూ కలిసి అందులో వున్న పైసలు లెక్క పెట్టారు. ఇరవై యేడు పైసలున్నాయి మొత్తం. వాటిలో ఇరవై అయిదు పైసలు ఆ నక్షత్రకుడి చెల్లెలి చేతుల్లో పోసి, ఆ పిల్లని సాగనంపారు అక్కడి నించి.

మిగిలిన రెండు పైసలు తమ్ముడి చేతిలో పెట్టి, కిందనున్న చిళ్ళ పెంకులు ఏరసాగింది శారద కళ్ళు తుడుచుకుంటూ.

వాళ్ళమ్మ చేష్టలుడిగి వాళ్ళవైపే చూస్తూ వుండిపోయింది.

మధూకి ఆ క్షణంలో దీపావళి పిస్తోలు మీద కోరిక చచ్చిపోయింది.

●